# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-10-2023** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. స్థిరమైన అభివృద్ధి, సామాజిక, ఆర్థిక పురోగతి మాత్రమే తీవ్రవాదాన్ని ఎదుర్కోవడానికి కీలక పరిష్కారాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు.**

**2. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ప్రక్రియలో భాగంగా పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగుల బదిలీలను నిషేధిస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది.**

**3. తెలంగాణా వ్యాప్తంగా కొత్తగా 57 కోర్టులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.**

**4. చైనాలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత్ 22 స్వర్ణ పతకాలతో సహా మొత్తం 95 పతకాలు సాధించింది.**

**5. మానవుని దైనందిన జీవితంలో పత్తి ప్రాశస్త్యాన్ని తెలియజేసేందుకు ఈరోజు ప్రపంచ పత్తి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

==========================

స్థిరమైన అభివృద్ధి, సామాజిక, ఆర్థిక పురోగతి మాత్రమే తీవ్రవాదాన్ని ఎదుర్కోవడానికి కీలక పరిష్కారాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన నిన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలో వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... కేంద్ర హోంమంత్రిత్వశాఖ సహకారంతో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వామపక్ష తీవ్రవాద సమస్యను సమర్ధవంతంగా ఎదుర్కోవడానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటోదని వివరించారు. రాష్ట్రంలోని 5 జిల్లాల్లో విస్తరించిన వామపక్ష కార్యకలాపాలు ఇప్పుడు అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని మారుమూల ప్రాంతాలకు మాత్రమే పరిమితమయ్యాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వామ పక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో ఒక వెయ్యి 87 కిలోమీటర్ల మేర రహదారి అనుసంధాన పనులు కూడా పూర్తి చేశామని... అటవీ ప్రాంతాలలోని అర్హులైన ఒక లక్షా 54 వేల మంది గిరిజన రైతులకు 3 లక్షల 23 వేల ఎకరాల మేర పట్టాలు జారీ చేశామని వివరించారు. ఇలాఉండగా... సదస్సు అనంతరం ముఖ్యమంత్రి, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో సమావేశమై రాష్ట్రానికి రావలసిన నిధులు పెండింగ్ అంశాలతో పాటు వివిధ అంశాలపై చర్చించారు.

--------------------------

తొమ్మిదవ జీ-20 పార్లమెంటరీ స్పీకర్ల శిఖరాగ్ర సదస్సు .... పీ-20 ఈనెల 13వ తేదీన ఢిల్లీలో జరగనున్నది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సును ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభిస్తారు. "ఒకే

భూమి–ఒకే కుటుంబం–ఒకే భవిష్యత్” అనే ప్రధాన ఇతివృత్తంతో స్పీకర్ల సదస్సు జరుగుతోంది. వివిధ దేశాల నుండి 25 మంది స్పీకర్లు, 10 మంది డిప్యూటీ స్పీకర్లు, 50 మంది పార్లమెంటు సభ్యులు ఈ ప్రపంచ స్థాయీ సదస్సులో పాల్గొంటారని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిన్న ఢిల్లీలో పాత్రికేయులకు తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ప్రక్రియలో భాగంగా పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగుల బదిలీలను నిషేధిస్తూ ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. 2024 ఓటర్ల తుది జాబితా రూపొందే వరకు నియామకాలు, బదిలీలపై ఎన్నికల ప్రధానాధికారి అనుమతి తీసుకోవాలని స్పష్టం చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఓటర్ల తుది జాబితా రూపకల్పనలో భాగస్వాములైన సిబ్బంది ఖాళీలపైనా అక్టోబర్ 10వ తేదీలోగా వివరాలను ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఇలాఉండగా... ఫొటో ఓటర్ల తుది జాబితా రూపకల్పన కోసం అన్ని ఖాళీలను అక్టోబర్ 10వ తేదీలోగా భర్తీ చేయాలని సూచించారు. 2023 అక్టోబర్ 27వ తేదీ నాటికి ముసాయిదా జాబితా, అలాగే 2024 జనవరి 5వ తేదీ నాటికి ఓటర్ల తుది జాబితా ప్రకటిస్తామని ముఖేష్ కుమార్ మీనా తెలిపారు.

--------------------------

ప్రస్తుత నీటి సంవత్సరంలో మే వరకూ తాగునీటి అవసరాల కోసం రెండు తెలుగు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టుల్లో లభ్యతగా ఉన్న నీటిలో ఆంధ్రప్రదేశ్‌కి 45 టీఎంసీలు, తెలంగాణకు 35 టీఎంసీలు కేటాయించాలని కృష్ణా బోర్డుకు త్రిసభ్య కమిటీ సిఫార్సు చేసింది. ప్రస్తుత నీటి సంవత్సరంలో కృష్ణా నదిలో నీటి లభ్యత, వినియోగం, మే వరకూ తాగునీటి అవసరాలపై చర్చించడమే అజెండాగా హైదరాబాద్‌లో కృష్ణాబోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ సి.నారాయణరెడ్డి, తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్‌లు సభ్యులుగా ఏర్పాటైన త్రిసభ్య కమిటీ నిన్న హైదరాబాద్‌లో సమావేశమైంది.

--------------------------

విశాఖపట్నం విమానాశ్రయం రన్‌వే పునరుద్ధరణ పనులు వేగంగా పూర్తిచేయాలని రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు...కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆ శాఖ కార్యదర్శి గిరిధర్‌కు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో ఆయన నిన్న వారిని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. రన్‌వే పునరుద్ధరణను దృష్టిలో ఉంచుకొని నవంబరు 15 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ వరకు రాత్రి 9 నుంచి ఉదయం 8 గంటల వరకు రన్‌ఎ మూసేయాలని నిర్ణయించడం వల్ల రాకపోకలు దెబ్బతినే అవకాశం ఉందని వారి దృష్టికి తీసుకెళ్లారు. కొత్త ఎయిర్‌పోర్టు గ్రేడ్ స్టీల్‌గార్డ్ విధానంతో పనులు వేగంగా పూర్తి చేయవచ్చని... రాత్రి 11 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకే విమానాశ్రయం మూసివేసేలా చూడాలని నరసింహారావు కోరారు.

--------------------------

తెలంగాణా రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీనే ప్రజలు ఆదరిస్తున్నారని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా పేర్కొన్నారు. మల్కాజిగిరి జిల్లా ఘటకేసర్‌లో నిన్న జరిగిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రాభివృద్ధి కోసం అనేక రకాలుగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని... గత తొమ్మిదేళ్లలో 9 లక్షల కోట్ల రూపాయల మేర నిధులు కేటాయించిందని తెలిపారు. ప్రాంతీయ పార్టీల వల్ల ఎటువంటి ప్రయోజనం వుండదని... ఈ పార్టీలు క్రమేపీ కుటుంబ పార్టీలుగా మారుతున్నాయని... వచ్చే ఎన్నికల్లో కుటుంబ పార్టీల పాలనకు ప్రజలు ముగింపు పలకనున్నారని జేపీ నడ్డా పేర్కొన్నారు.

--------------------------

మానవుని దైనందిన జీవితంలో పత్తి ప్రాశస్త్యాన్ని తెలియజేసేందుకు ఈరోజు ప్రపంచ పత్తి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు ప్రతి ఏటా అక్టోబర్ 7వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. ప్రజలకు అనేక రకాలుగా ఉపయోగపడుతూ, వాణిజ్యపరంగా లాభసాటిగా వుండే పత్తి పంటకు మంచి భవిష్యత్ ఇవ్వడం, పత్తిసాగు చేసే రైతులు, కూలీల జీవితాలను మెరుగుపరచడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం.

-------------------------

తెలంగాణా వ్యాప్తంగా కొత్తగా 57 కోర్టులను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి, సీనియర్ సివిల్ జడ్జి, జూనియర్ సివిల్ జడ్జి కేడర్లలో ఈ కోర్టులను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి ఆర్.తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో బాలలపై జరిగే నేరాల విచారణకు ప్రత్యేకంగా 10 కోర్టుల ఏర్పాటుకు ప్రాధాన్యమిచ్చారు. కొత్త కోర్టుల్లో సిబ్బంది నియామకానికి ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొన్నారు.

-------------------------

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన బెయిల్, సీఐడీ కస్టడీ పిటిషన్లపై ఏసీబీ కోర్టులో నిన్న వాదనలు ముగిశాయి. చంద్రబాబు నాయుడు తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది ప్రమోద్‌కుమార్ దూబే.. సీఐడీ తరఫున అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. 9వ తేదీన తీర్పు వెలువరిస్తామని ఏసీబీ కోర్టు న్యాయవాది తెలిపారు.

మరోవైపు స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టై రాజమహేంద్రవరం జైలులో ఉన్న చంద్రబాబు నాయుడుతో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, కుటుంబ సభ్యులు భువనేశ్వరి, బ్రాహ్మణి సమావేశమయ్యారు. అనంతరం లోకేశ్ పాత్రికేయులతో మాట్లాడుతూ... తమ పార్టీ అధినేతను నిరాధారంగా అరెస్టు చేశారని, కక్ష్య సాధింపుతోనే ఆయనను రిమాండ్‌కు పంపారని ఆరోపించారు.

-------------------------

చైనాలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత అథెట్లు పతకాలను సాధిస్తూ అద్భుత ప్రదర్శనను కబరుస్తున్నారు. నిన్న జరిగిన హాకీ, బ్రిడ్జ్, సెపక్‌టక్రా, ఆర్చరీ, రెజ్లింగ్ విభాగాల్లో భారత్ 1 స్వర్ణం, 2 రజతం, 6 కాంస్య పతకాలు సాధించింది. ఆసియా క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శనతో 22 స్వర్ణాలు, 34 రజతాలు, 39 కాంస్యాలతో సహా మొత్తం 95 పతకాలతో పతకాల పట్టికలో భారత్ నాలుగో స్థానంలో కొనసాగుతోంది. మరోవైపు 19వ ఆసియా క్రీడల్లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమాల వేదికగా అభినందించారు.

-------------------------

వన్డే వరల్డ్ కప్‌లో భాగంగా హైదరాబాద్‌లో నిన్న జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ 81 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్.. 49 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌటైంది. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన నెదర్లాండ్స్ జట్టు 41 ఓవర్లలో 205 పరుగులు చేసి ఆలౌటైంది. కాగా... ప్రపంచకప్‌లో భాగంగా ధర్మశాల వేదికగా అఫ్ఘానిస్తాన్, బంగ్లాదేశ్ జట్ల మధ్య ఢిల్లీ వేదికగా శ్రీలంక, దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఈ రోజు మ్యాచ్‌లు జరుగుతాయి.

====================